క్లుప్తంగా

గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హుజూరాబాద్: పట్టణంలోని మామిండ్ల వాడకు చెందిన పాల వ్యాపారి ఎండీ హమీద్ గడ్డివాము ప్రమాదవశాత్తు ఆదివారం దగ్ధమైంది. హమీద్ తన గేదెలకు మేత కోసం గడ్డిని ఇంటి సమీపంలో నిల్వ చేశాడు. ప్రమాదశాత్తు మంటలు అంటుకున్నాయి. హమీద్ వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే వాము పూర్తిగా కాలి బూడిదైంది. సుమారు రూ.15వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

పరామర్శ



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: కందుగుల గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, మాజీ సర్పంచ్ పడిదం బక్కారెడ్డి శనివారం అనారోగ్యంతో మృతిచెందగా.. ఆదివారం వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. దహన సంస్కారాల కార్యక్రమానికి హాజరై పాడె మోశారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సైతం పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు రాముల కుమార్, రావుల భాస్కర్‌రెడ్డి, కేసిరెడ్డి విజేందర్‌రెడ్డి, తూర్పాటి రాజు, గంగిశెట్టి ప్రభాకర్, కొండాల్‌రెడ్డి, ముప్పు మహేశ్, చీదురాల శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం చందర్‌రెడ్డి తదితరులున్నారు.

కాకాకు నివాళి



హుజూరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి నిర్వహించారు. నాయకులు కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సొల్లు బాబు, యేముల పుష్పలత, పుల్ల రాధ, సొల్లు దశరథం, ఆలేటి సుశీల, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, తౌసిఫ్ తదితరులున్నారు.

బీజేపీ జెండా ఎగరేస్తాం



మాట్లాడుతున్న రమణారెడ్డి

ఇల్లందకుంట: స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరేస్తామని మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల మండలస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు ఆకుల రాజేందర్, కంకణాల రవీందర్‌రెడ్డి, నల్ల లింగారెడ్డి, ఇంగ్లే ప్రభాకర్, అంతం ఎల్లారెడ్డి, ఉప్పుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందిస్తున్న ప్రణవ్

జమ్మికుంట: బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన రాచపల్లి రాజ్‌కుమార్ కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా ఎన్నికవ్వగా.. హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పత్తి మధుబాబు, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు నరెడ్ల వినోద్‌రెడ్డి నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు.

కాంగ్రెస్ సేవాదళ్..

హుజూరాబాద్‌రూరల్: నియోజకవర్గంలోని ఆయా మండలాల కాంగ్రెస్ సేవాదళ్ మండలాధ్యక్షులను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దల జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మండలాధ్యక్షులు సింగాపూర్ గ్రామంలోని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హుజూరాబాద్ టౌన్ అధ్యక్షుడిగా పూదరి కృష్ణ, జమ్మికుంట టౌన్ అధ్యక్షుడిగా బండి పవన్, వీణవంక అధ్యక్షుడిగా ఆవల రామకృష్ణ, ఇల్లందకుంట అధ్యక్షుడిగా గందం రవీందర్, కమలాపూర్ మండలాధ్యక్షుడిగా శనిగరపు రమేశ్ ఎన్నికయ్యారు. నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు నరెడ్ల వినోద్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఓపెన్ జిమ్‌లకు ఆదరణేది..?

- విరిగిన వ్యాయామ పరికరాలు, ఊడిన విడి భాగాలు
- దెబ్బతిన్న ప్లాట్‌ఫామ్‌లు



హుజూరాబాద్ హైస్కూల్ క్రీడా మైదానంలో దెబ్బతిన్న ఓపెన్ జిమ్ ప్లాట్‌ఫామ్

హుజూరాబాద్: ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బహిరంగ ప్రదేశాలు, పార్క్‌లలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లకు ఆదరణ లేక వెలవెలబోతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు ఎక్కడికక్కడ మరమ్మతుకు గురవుతున్నాయి. కొన్ని పరికరాలు విరిగిపోగా.. మరికొన్ని విడిభాగాలు ఊడిపడి తుప్పు పడుతున్నాయి.

లక్షలాది వ్యయంతో..

హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, హైస్కూల్ క్రీడా మైదానం, ఆహల్యనగర్‌సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద, గణేశ్‌నగర్ ప్రాంతంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో లక్షల వ్యయంతో ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేశారు. పట్టణవాసులు కొంతకాలం వినియోగించుకోగా.. తదుపరి జిమ్‌ల పర్యవేక్షణ, నిర్వహణకొరవడంతో వ్యాయమ పరికరాలు ఎక్కడికక్కడ దెబ్బతిని విరిగిపోవడం, విడిభాగాలు ఊడిపోవడంతో వ్యాయామం చేసేందుకు పనికి రాకుండాపోయాయి. ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరక పోగా.. వ్యాయామం చేయాలనుకున్న వారు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో మూన్నాళ్ల ముచ్చటగా మారాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరికరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వ్యాయామానికి సంబంధించిన శిక్షకుడిని కూడా నియమించాలని కోరుతున్నారు.

మరమ్మతు చేయించాలి



ఓపెన్ జిమ్ పరికరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరమ్మతు చేయించాలి. అందుబాటులో ఓ శిక్షకుడిని ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తాళ్ల మల్లయ్య, వాకర్, హుజూరాబాద్

జిమ్ ఏర్పాటు తర్వాత నిర్లక్ష్యం..



ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన తర్వాత సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. పరికరాలు దెబ్బతిన్నాయి. జిమ్ పరికరాల పరిరక్షణ చర్యలు చేపట్టాలి.

– ఇల్లందుల సంపత్, వాకర్, హుజూరాబాద్

చర్యలు చేపడుతాం



ఓపెన్ జిమ్ పరికరాల నిర్వహణపై దృష్టి సారిస్తాం. దెబ్బతిన్న ఓపెన్ ప్రాంతల వద్ద పటిష్ట సౌకర్యాల కల్పనకు టెండర్లను పిలిచాం. కార్యాచరణ రూపొందించి ఆదిశగా కృషి చేస్తాం.

– కెంసారపు సమ్మయ్య, కమిషనర్, హుజూరాబాద్

సైదాపూర్‌లో భారీ వర్షం

సైదాపూర్: మండలంలో భారీ వర్షం కురవడంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. గ్రామాల్లో వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఇళ్లలోకి వరద చేరింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతోపాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచి భారీ వర్షం కురిసింది. సైదాపూర్ మురుగు కాలువ శిథిలావస్థలో ఉండడంతో.. వరద నీరు రోడ్డుపైకి వచ్చి వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు పడే లోతట్టు ప్రాంతమైన జంట గ్రామాల దారులు పూర్తిగా నీటితో మునిగిపోయాయి. పాత బస్టాండ్, సైదాపూర్ పది, ఐదు, ఆరో వార్డుల ఇళ్లలోకి వర్షపు వరద నీరు చేరి నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి.



సైదాపూర్‌లో ఇంట్లోకి చేరిన వరద నీరు

డీజీపీని కలిసిన రాజేందర్‌రావు



శివధర్‌రెడ్డిని అభినందిస్తున్న రాజేందర్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీజీపీ శివధర్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు కలిసి అభినందించారు. అలాగే ఇంటలిజెన్స్ అదనపు డీజీ విజయ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

చొప్పదండి: త్వరలో జరుగనున్న ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను ఆశిస్తున్న అభ్యర్థుల నుంచి కాంగ్రెస్ నాయకులు ఆదివారం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీటీసీ టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందులకు దరఖాస్తులు అందజేశారు. ఒక్కో ఎంపీటీసీ స్థానానికి రెండు నుంచి ఐదు వరకు దరఖాస్తులు వచ్చాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, నాయకులు పెరుమాండ్ల గంగయ్యగౌడ్, ముద్దం తిరుపతిగౌడ్, మునిగాల సుధాకర్‌గౌడ్, మునిగాల చందుగౌడ్, కొట్టె అశోక్, తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్, గుంటి స్వరూప, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జాతీయ రహదారిపై ధాన్యం కుప్పలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో ఎరగాలు వరి సాగు చేసిన రైతులు ఆదివారం హార్వెస్టర్‌తో కోతలు కోయించారు. కోసిన ధ్యాన్యాన్ని కరీంనగర్–వరంగల్ జాతీయరహదారిపై రైతులు కుప్పలు పోశారు. వర్షం కురియడంతో ధాన్యం కుప్పలు పోసి పరదలు కప్పారు.



కొత్తగట్టులో జాతీయరహదారిపై ధాన్యం కుప్పలు



ప్రమాదకరంగా కల్వర్టు

వీణవంక: మల్లన్నపల్లి–ఘన్ముక్కుల గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు కల్వర్టు దెబ్బతింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్లన్నపల్లి గ్రామస్తులు ఏ చిన్న పనికైనా ఘన్ముక్కులకు వెళ్తుంటారు. వర్షాలు కురిసినప్పుడు కల్వర్టు పూర్తిగా మునిగిపోతుంది. దీంతో బ్రహ్మణపల్లి, రెడ్డిపల్లి మీదుగా ఘన్ముక్కులకు వెళ్లాల్సి వస్తుంది. దూర భారం పెరుగుతుందని, అధికారులు స్పందించి కల్వర్టును నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



హుజూరాబాద్‌రూరల్: ఇప్పలనర్సింగాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఉన్న ఎస్సారెస్పీ వంతెన ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. అసలే ఇరుకైన వంతెన.. ఇరువైపులా సైడ్ వాల్స్ దెబ్బతిని మరింత ప్రమాదకరంగా మారింది. వంతెన సమీపంలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో కొత్తగా ఎవరైనా గ్రామానికి వచ్చేవారు ప్రమాదం బారిన పడడం ఖాయమంటూ గ్రామస్తులు వాపోతున్నారు.

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



అసంపూర్తిగా గ్రామపంచాయతీ భవనం

రామడుగు మండలం చిప్పకుర్తిలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనం అసంపూర్తిగా ఉంది. మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించి స్లాబ్ వరకే వేసి వదిలేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని గ్రామపంచాయతీ భవనం త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– రామడుగు

లో లెవల్ కాజ్‌వేలతో ఇబ్బందులు

- భారీ వరదలతో రాకపోకలు బంద్
- బ్రిడ్జిలు నిర్మిస్తే ప్రయాణం సులువు
- నిలిచిన డబుల్ రహదారి పనులు



గుండ్లపల్లి- కరీంనగర్ రహదారి కల్వర్టుపై వరద నీరు ప్రవాహం

గన్నేరువరం: మండలంలోని ప్రధాన రహదారులపై 20 ఏళ్ల క్రితం నిర్మించిన లోలెవల్ కల్వర్టులు భారీ వర్షాలకు నీట మునుగుతుండడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. 2019 వరకు గన్నేరువరం మండలం మెట్ట ప్రాంతం, వర్షం పడితే తప్పా నీటి ప్రవాహాలు తక్కువ. కాళేశ్వరం, మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణాలతో గన్నేరువరం మండలం దశ మారింది. ఈ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో పాటు జోరు వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు, వంకలన్నీ నిండుకుని ఆ వరదంతా రహదారులపై పైకి వస్తోంది. గత నాలుగేళ్లుగా భారీ వర్షాలతో వరద నీరు రహదారుల పైకి పారి ప్రయాణాలు నిలిచిపోతున్నాయి. గతంలో వరద నీరు పోవడానికి అప్పటి పరిస్థితులకనుగుణంగా లోలెవల్ కాజ్‌వేలు నిర్మించారు. ప్రస్తుతం పెరిగిన వరద నీరుకు అనుగుణంగా డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టి హైలెవల్ కల్వర్టులు, బ్రిడ్జీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇది పరిస్థితి...

2016లో గన్నేరువరంను నూతన మండలంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంలో ప్రధాన రహదారి ఒక్కటే అది మండలకేంద్రం నుంచి గుండ్లపల్లి మీదుగా కరీంనగర్‌కు వెళ్లేది. ఈ ఏడాది భారీ వర్షాలతో చెరువులు, కుంటలు అలుగు పారుతూ వరద నీటి ప్రవాహాలు అధికంగా ఉండటంతో లోలెవల్ కాజ్‌వేలను మించి రహదారులపై ప్రవాహిస్తోంది. కరీంగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుండ్లపల్లి వద్ద లోలెవల్ కల్వర్టు నుంచి భారీ వరద వెళ్లుతుండటంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. అలాగే జంగపల్లి గ్రామ చెరువు భారీస్థాయిలో అలుగు పడటంతో ఈ నీరాంత జంగపల్లి –హన్మాజిపల్లె గ్రామాల మధ్య గల లోలెవల్ కల్వర్టుపైకి చేరుతోంది. ఇక్కడ లోలెవల్ కాజ్‌వే కారణం. మండలకేంద్రం గన్నేరువరం నుంచి చొక్కారావుపల్లె, మీదుగా కరీంనగర్‌కు వెళ్లే రహదారిలో లోలెవల్ కల్వర్టు సమస్యగా మారింది. ఇక్కడ భారీ వరద కారణంగా రోజుల పాటు రహదారిని మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వీటికి తోడు అడుగుఅడుకో గుంత ఉండటంతో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు.

పరిస్థితి మారేనా..

గుండ్లపల్లి నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు రూ.71 కోట్లతో చేపట్టిన డబుల్ రహదారి నిర్మాణ పనులు నత్తనడకనా సాగుతున్నాయి. గుండ్లపల్లి నుంచి గునుకుల కొండాపూర్ వరకే బీటీ రహదారి పూర్తికాగా, గునుకులకొండాపూర్ నుంచి జంగపల్లి వరకు కంకర రహదారి పనులను చేపట్టారు. జంగపల్లి నుంచి మైలారం క్రాసింగ్ వరకు గ్రావెల్ పనులు చేపట్టారు. ప్రస్తుత పరిస్థితులతో డబుల్ రహదారిగా అభివృద్ధి చేయడంతో పాటు లోలెవల్ కాజ్‌వేలు ఉన్న చోటా హైలెవల్ కాజ్‌వేలు లేదా బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. వరదలతో రాకపోకలు నిలిస్తే జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల అత్యవసర పరిస్థితులతో వెళ్లడానికి ప్రజలు, అధికారులు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని వడ్లూరు, బేగంపేట, తోటపల్లి గ్రామాల మీదుగా రాజీవ్ రహదారి ఫోర్‌లైన్‌కు చేరుకుని వెళ్లుతున్నారు.

ప్రమాదాలు

2021లో గన్నేరువరం– చొక్కారావుపల్లె కల్వర్టు వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వాహనంలో కొట్టుకపోతుండగా పోలీసులు రక్షించారు. 2022లో జంగపల్లి కల్వర్టు వద్ద ఎదురుగా వస్తున్న కారుకు సైడ్ ఇవ్వబోయిన ట్రాక్టరు డ్రైవర్ అదుపు తప్పిన ట్రాక్టర్ కల్వర్టు కిందకు దూసుకెళ్లింది. అదే ఏడాది ద్విచక్రవాహనం కొట్టుకుపోతుండగా స్థానికులు కాపాడారు. ఈ ఏడాది జంగపల్లి కల్వర్టు పూర్తిగా ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

రహదారి పనులు పూర్తి చేయాలి



గన్నేరువరం మండలం ఏర్పడి తొమ్మిదేళ్లు ఆవుతోంది. ప్రధాన రహదారి గుండ్లపల్లి స్టేజీ నుంచి గన్నేరువరం వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారింది. డబుల్ రహదారి పనులు ముందుకు వెనక్కు అన్నట్లు సాగుతున్నాయి. భారీ వర్షాలతో వరద నీరు లోలెవల్ కల్వర్టులు, కాజ్‌వేల పైకి వస్తోంది. సంబంధిత అధికారులు డబుల్ రహదారి పనులను త్వరగా పూర్తి చేసి హై లెవల్ కల్వర్టు, బ్రిడ్జిలను నిర్మించాలి. – చొక్కాల శ్రీశైలం, చొక్కాల పల్లె

బ్రిడ్జిలను నిర్మిస్తాం

ప్రస్తుత ఉన్న లోలెవల్ కల్వర్టు వద్ద హై లెవల్ కల్వర్టులు లేదా బ్రిడ్జీల నిర్మాణాలను చేపడుతాం. గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రహదారి పనులు పూర్తయితే కల్వర్టుల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ప్రస్తుతం రహదారి పనులు నిలిచిపోయాయి. గుండ్లపల్లి స్టేజీ నుంచి గునుకులకొండాపూర్ వరకు రెండున్నర కిలోమీటర్ల బీటీ రహదారి పూర్తయ్యింది. – సురేశ్,ఆర్అండ్‌బీ ఏఈ, గన్నేరువరం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చొప్పదండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల వేదికగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని తమ అనుభూతులు పంచుకున్నారు. గురువులను సన్మానించారు. – చొప్పదండి



హుజూరాబాద్: పట్టణంలోని నవభారతి విద్యాలయంలో 2008–09 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గురువులను శాలువాతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి, ఉపాధ్యాయులున్నారు.